గుడితండాలో రీజినల్ రింగ్ రోడ్డు కోసం మార్క్ వేసిన ప్రదేశాన్ని ఎమ్మెల్యేకు చూపుతున్న తండా వాసులు

మా భూములు రక్షించండి

ఆమనగల్లు, సెప్టెంబర్ 10: ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ గ్రామపంచాయతీకి చెందిన గుడితండాలో మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించారు. రీజినల్ రింగ్ రోడ్‌లో భాగంగా గుడి తండా గేట్ సమీపంలో మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా తండా వాసులు రీజినల్ రింగ్ రోడ్డులో తమ భూములు కోల్పోకుండా చూడాలని ఎమ్మెల్యేను కోరారు.

పరామర్శ..

తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామ మాజీ సర్పంచ్ బండి రఘుపతి తండ్రి లక్ష్మయ్య మృతి చెందగా, మృత దేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే విధంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి మరణించగా, ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అంతకుముందే పడకల్ గ్రామపంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాలకు తెగిన చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 10 : నెల 25 వ తేదీన ఇబ్రహీంపట్నంలో జరిగే 'హలో మత్స్యకార..చలో ఇబ్రహింపట్నం' రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను మంగళవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో జరిగే మత్స్యకారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

వంశీబాబుకు డాక్టరేట్



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10 : ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన కొండ్రు బాలరాజు భారతమ్మ కుమారుడు వంశీబాబుకు భౌతికశాస్త్రం విభాగంలో చేసిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ ఉపేందర్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా వంశీబాబుకు డాక్టరేట్ రావటంపై కుటుంబసభ్యులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

మాసబ్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 10 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను మున్సిపాలిటీ అధికారులు ముమ్మరం చేశారు. మాసబ్ చెరువు వద్ద నిమజ్జనం కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టేందుకు మున్సిపల్, ఇరిగేషన్, పోలీస్, వైద్య, అగ్నిమాపక శాఖల సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. చెరువు లోపలికి విగ్రహాలను తరలించడానికి జేసీబీలను ఏర్పాటు చేశారు. భక్తులకు వైద్యసాయం కోసం వైద్య సిబ్బందితో క్యాంపును ఏర్పాటు చేశారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలిస్తూ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 10 : ఇంటి నుంచి తప్పిపోయిన ఓ వృద్ధుడు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో తిరుగుతుండడంతో సురక్ష సేవా సంఘం సభ్యులు గమనించి స్థానిక పోలీసుల సహకారంతో సమీపంలోని ఆలేటి ఆశ్రమంలో చేర్పించారు. సురక్ష వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయడంతో ఆ వృద్ధుడి కుమారుడు సోమవారం ఉదయం సురక్ష కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకొని ఆలేటి ఆశ్రమంలో ఉన్న తన తండ్రిని ఇంటికి తీసుకెళ్లాడు. అందుకు సహకరించిన పోలీసులు, సురక్ష సేవా సంఘం సభ్యులకు, ఆలేటి ఆశ్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కడ్తాల్ (తలకొండపల్లి), సెప్టెంబర్ 10: పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని మండల వైద్యురాలు స్నేహ అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలు, వంటశాలను ఆమె పరిశీలించారు. అనంతరం వసతి గృహ సిబ్బందితో ఆమె మాట్లాడారు. వసతి గృహం పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులకు సమాచారం అందించాలన్నారు. ఆమె వెంట వైద్య, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

వీరవనిత చాకలి ఐలమ్మ

ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు

షాద్‌నగర్ పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

చేవెళ్లటౌన్: ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 10: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న ఆమె విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో విరోచితంగా పోరాడి వేలాది మంది రైతులకు అండగా నిలిచిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు. అదే విధంగా వివిధ సంఘాల నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయురాలు చాకలి ఐలమ్మ

చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శప్రాయురాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆమె విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, కౌన్సిలర్లతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అంతయ్య, నాయకులు జూపల్లి శంకర్, శేఖర్, శ్రీనివాస్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

షాబాద్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణయాదవ్ తదితరులు

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

చేవెళ్లటౌన్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఇంద్రారెడ్డి చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పార్టీలక తీతంగా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను చైతన్యం చేయడంలో ఐలమ్మ పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. దొరల పాలనను అంతమొందించేందుకు వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి సమాజానికి ఎంతో ఆదర్శమన్నారు. భూమి కోసం, భుక్తి కోసం అణచివేత విముక్తి కోసం పోరాటం చేసిన మహనీయురాలు ఐలమ్మ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, కేసారం గ్రామ మాజీ సర్పంచ్ రమేశ్‌గౌడ్, చేవెళ్ల గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, సీపీఐ నాయకులు, రామస్వామి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, బీజేసీ నాయకులు భైభవ్‌రెడ్డి, అనంతరెడ్డి, మహిళా నాయకురాలు సమతారెడ్డి, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం : వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలుపార్టీల నాయకులు అన్నారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సామెల్, రజకసంఘం నాయకులు మైలారం విజయ్‌కుమార్, శ్రీరాములు, అంజనేయులు, శ్రీశైలం, సీపీఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మాడ్గుల, ఆమనగల్లు : మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాడ్గుల మాజీ జడ్పీటీసీ రవితేజ, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, రజక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శంకర్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అదే విధంగా ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రజక సంఘం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కుసుమ మాధురి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు యాదయ్య, కొండయ్య, నరేశ్, వెంకట్, వెంకటేశ్, నరేశ్, శ్రీనివాస్‌గౌడ్, దళపతిగౌడ్, తిరుపతయ్య, ఆనంద్ ఉన్నారు.

షాబాద్ : చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా షాబాద్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, రజకసంఘం జేఏసీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షాబాద్ మాజీ సర్పంచ్ రవీందర్, మాజీ ఎంపీటీసీ అశోక్, తెలంగాణ ప్రజాచైతన్యసమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింహులు, బీజేపీ మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు అస్మత్‌పాషా, రాహుల్ గుప్తా, రాము, సురేశ్, శ్రీశైలం, రమేశ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

మొయినాబాద్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం మండల అధ్యక్షుడు చాకలి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు చాకలి మల్లేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు భాస్కర్, రజక సంఘం నాయకులు చాకలి యాదయ్య, చాకలి శ్రీనివాస్, చాకలి నవీన్‌కుమార్, రఘు, మహేందర్, గౌడ కుల హక్కుల సమితి అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మంచాల : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, మండల రజక సంఘం సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, కాంగ్రెస్, రజక సంఘం నాయకులు కృష్ణ, యాదయ్య, శ్రీనివాస్‌నాయక్, జనార్ధన్, శ్రీరాములు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలో మంగళవారం వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘం గ్రామ అధ్యక్షుడు బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మహేశ్‌గౌడ్, చేగూరి వెంకటేశ్, నర్సింహ, నర్సింహులు, భాస్కర్, కృష్ణ, అంజయ్య, యాదయ్య, కే వెంకటేశ్ పాల్గొన్నారు.

యాచారం : మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మండల పరిధి దేవునిఎర్రవల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎదిరె శ్రీశైలం, పాండు పాల్గొన్నారు.

పాద్దుటూరు గ్రామంలో

ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పొద్దుటూరు గ్రామంలో మంగళవారం ఐలమ్మ విగ్రహానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు రాంరెడ్డి, చాకలి రాములు, గోవర్ధన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చాకలి మల్లేశ, గ్రామస్తులు బొల్లారం మోహన్‌రెడ్డి, జంగారెడ్డి, రఘుపతి రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, క్రాంతి యువజన సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్లేశం, వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, నర్సింహ, సంఘం నాయకులు వెంకటయ్య, శేఖర్, కరుణాకర్, బాలరాజు, గిరి, నర్సింహ, వెంకటేశ్, మహేశ్, మధు, శంకర్, జగన్, సురేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 10: ఓఆర్ఆర్‌పై కారు ఢీకొని ఓఆర్ఆర్ హెచ్ఎండీఏ ఉద్యోగి మృతిచెందారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట పరిధిలో ఓఆర్ఆర్‌పై మంగళవారం చోటుచేసుకున్నది. అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నానికి చెందిన బసవపురం లలిత (45) ఓఆర్ఆర్ హెచ్ఎండీఏ ఉద్యోగి. తారామతిపేట గ్రామ పరిధిలో ఓఆర్ఆర్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో ఉండగానే.. ఘట్‌కేసర్ వైపు నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన లలితను పీర్జాదిగూడలోని ఓ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ సాయంత్రం ఆమె చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

నీటి సంపులో పడి బాలుడి..

అభిరామ్ (ఫైల్)

కడ్తాల్ (తలకొండపల్లి), సెప్టెంబర్ 10: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన, తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన దుడ్డు శేఖర్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సోమవారం సాయంత్రం శేఖర్ చిన్న కుమారుడు అభిరామ్(2), కుమార్తె ఇంటి బయట ఆడుకుంటున్నారు. భార్య, పెద్ద కుమారుడు ఇంటి లోపల ఉన్నారు. కాసేపటికి కూతురు ఏడ్చుకుంటూ ఇంట్లోకి వెళ్లింది. కూతురుతో కలిసి ఆడుకుంటున్న అభిరామ్ ఇంట్లోకి రాకపోవంతో తల్లి ఆందోళన చెందింది. ఇంటి పరిసరాలు, చుట్టు పక్కల ఇండ్లలో వెతికినా కుమారుడి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఇంటి ముందు ఉన్న నీటి సంపులో చూడగా, అభిరామ్ అందులో పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే బాలుడిని కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం బాలుడిని హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానకు తీసుకెళ్లారు. దవాఖానలో చికిత్స పొందుతున్న బాలుడు సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 10 : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ ఖైరంఖాన్ చెరువులో నిమజ్జన ఏర్పాట్లను ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, ఏసీపీ నవీన్‌రెడ్డి మంగళవారం తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వనస్థలిపురం ట్రాఫిక్ సిఐ గట్టుమల్లు, అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్ఐ మాధవరావు, ఏఎస్ఐ సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. పలువురికి గాయాలు

మొయినాబాద్, సెప్టెంబర్10: ఆటోను వెనకాల నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. మొయినాబాద్ పోలీసుల వివరాల ప్రకారం మండల పరిధిలోని తోలుకట్టా గ్రామానికి చెందిన ఊరడి వెంకటేశ్ కుమారుడు శ్రీకాంత్ సోమవారం అర్ధరాత్రి ఆటోలో రైతులతో కలిసి ప్రయాణిస్తుండగా, మొయినాబాద్ మండల కేంద్రంలోని రాధాస్వామి సతసంగ్ బాస్ వద్దకు రాగానే లారీ ఆటోను వెనకాల నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ శ్రీకాంత్, ఆటోలో ఉన్న మల్లేశ్‌కు, ప్రభాకర్‌కు గాయాలైనాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చేవెళ్ల బస్టాండ్‌లో దొంగల చేతివాటం

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 10: బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వచ్చిన మహిళ నుంచి రూ.45వేలు చోరీకి గురైన ఘటన చేవెళ్లలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం షాబాద్ మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కావలి సావిత్రి చేవెళ్ల మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గతంలో తీసుకున్న రుణం డిపాజిట్ చేసేందుకు నగదు తీసుకుని వచ్చింది. రూ.51వేలు డిపాజిట్ చేయాల్సి ఉండగా, ఆమె వద్ద రూ. 45వేలు మాత్రమే ఉండటంతో బంగారం తాకట్టు పెట్టి మరింత రుణం తీసుకొని చెల్లించాలని భావించింది. అయితే, బ్యాంకులో గోల్డ్ స్మిత్ అందుబాటులో లేకపోవడంతో మరుసటి రోజు వద్దామని తాను వెంట తీసుకొచ్చిన డబ్బులతో తిరిగి వెళ్తుండగా బస్సు ఎక్కే క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె సంచిలో నుంచి నగదును దొంగలించారు. కాసేపటి తరువాత సంచిలో డబ్బులు కనిపించకపోవడంతో చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

గణనాథుడికి పూజలు

ఆమనగల్లు, సెప్టెంబర్ 10: పట్టణంలోని నవ చైతన్యకాలనీలో బుద్ధినాథ్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా కలిసి సందర్శించి పూజలు చేశారు. వీరితో పాటు జీఎస్ఆర్ యువసేన నాయకుడు, బుద్ధినాథ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సతీశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగల్‌విండో సీఈవో దేవేందర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సుభాశ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీను, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమేశ్, వెంకటయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

మొయినాబాద్, సెప్టెంబర్10: మండల పరిధిలోని సురంగల్ గ్రామంలో మాజీ వార్డు సభ్యురాలు యాలాల సుగుణమ్మ జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన సుగుణమ్మ భర్త యాలాల శ్రీనివాస్‌రెడ్డి, కుమారుడు యాలాల మాధవరెడ్డి సిద్ధి వినాయక మండపం షెడ్డు నిర్మాణం కోసం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని మండప నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

సమస్యలు పరిష్కరిస్తా

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 10: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నానని, అనాటి జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. పాఠశాల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు కొరత, తరగతి గదుల నిర్మాణంపై జిల్లా విద్యాశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ శివలింగంగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

డయల్ యువర్ డీఎంకు 23 ఫిర్యాదులు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్టీసీ డీఎం ఉష

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 10: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 23ఫిర్యాదులు వచ్చాయని డీఎం ఉష తెలిపారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్, పెద్ద ఎల్కిచర్ల, ఆమనగల్లు, మహబూబ్‌నగర్‌కు బస్సులను పెంచాలని, ఎక్స్‌ప్రెస్ బస్సులను నందిగామ వద్ద ఆపాలని, సిటీ బస్సులను షాద్‌నగర్ వచ్చే విధంగా చూడాలని, బస్టాండ్‌లో ప్రతిరోజూ మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని, పరిగి డిపో బస్సులు ఎలికట్ట వద్ద ఆపాలని, కేశంపేట మండలం నిర్దావెల్లి గ్రామానికి బస్సులను ఏర్పాటు చేయాలని, బస్టాండ్‌లోని పరిగి ప్లాట్‌ఫాంపై కుర్చీలను ఏర్పాటు చేయాలని, లింగారెడ్డిగూడకు బస్సు ఏర్పాటు చేయాలని, చేవెళ్ల బస్సులను మధ్యాహ్న సమయంలో నడిపే విధంగా చూడాలని మొత్తం 23మంది ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ ద్వారా సమస్యలు లేకుండా మెరుగైన సేవలను అందించడం కోసం ప్రతి నెల ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

చిరు వ్యాపారులకు ఉపా